సాక్షి
మెదక్
బుధవారం ॥ 11 ॥ సెప్టెంబర్ ॥ 2024



అథ్లెటిక్స్ పోటీలు

పదవ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ అండర్ 14, 16, 18, 20 బాల బాలికలకు పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. వివరాలు 8లో ▸



పోషకాహారంతో..

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సంతోష అన్నారు.

వివరాలు 9లో ▸

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) జావేద్ ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతు పనులు సందర్భంగా పట్టణంలోని జేఎన్ రోడ్డు, పెద్దబజార్, మార్కెట్, బారాఇమామ్ తదితర ప్రాంతాల పరిధిలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

న్యూస్‌రీల్

వనదుర్గమ్మ దర్శనం ప్రారంభం

9 రోజుల అనంతరం గర్భగుడిలో పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న దుర్గమ్మ

పాపన్నపేట(మెదక్): మంజీరా వరదలు తగ్గుముఖం పట్టాయి. దీంతో తొమ్మిది రోజుల పాటు జల దిగ్బంధనంలో చిక్కుకున్న వన దుర్గమ్మ ఆలయం మంగళవారం తెరుచుకుంది. ఆలయాన్ని శుద్ధి చేసిన అనంతరం.. అర్చకులు దుర్గమ్మను ఎరుపు రంగు వస్త్రాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అంద జేశారు. ఈనెల ఒకటో తేదీ నుంచి మంజీరా నది వరదలు ఆలయాన్ని ము ంచెత్తడంతో రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పూజలు నిర్వహించారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

జిల్లా తపస్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్



సభ్యత్వ నమోదులో పాల్గొన్న చల్లా లక్ష్మణ్

పెద్దశంకరంపేట(మెదక్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని గత ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని జిల్లా తపస్ ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దశంకరం పేటలోని ఆయా పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 317 జీఓ ద్వారా అన్యాయానికి గురైన వారికి న్యాయం చేయాలని, కేజీబీవీ ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలని, మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని, వారికి బదిలీలు చేపట్టాలని, ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర బాధ్యులు రమేష్, పెద్దశంకరం పేట మండల అధ్యక్షుడు రవి, అల్లాదుర్గం అధ్యక్షుడు గురుచరణ్, దేవానంద్, సంతోష్, సాయిలు, విఠల్, జగదీష్, అనిత, ప్రవీణ్, ఆశారాణి తదితరులు ఉన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న మంజుల

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని మెదక్ మహిళ సాధికారిక కేంద్రం అధికారులు నాగమణి, కవిత అన్నారు. మంగళవారం చిన్నశంకరం పేట మండలం సూరారం జెడ్పీపాఠశాలలో మహిళ సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో బాల బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలబాలికలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రలోభాలకు గురైతే జీవితంలో చాలా కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బాలబాలికల్లో మానసిక, శారీరక ధృడత్వం అవసరమన్నారు. పోషక విలువలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు గురుకులాల్లో స్పాట్ కౌన్సెలింగ్

మెదక్ కలెక్టరేట్: ఈనెల 12న జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జోనల్ అధికారిణి నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5 నుంచి 9వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి అడ్మిషన్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న అతికొద్ది సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈనెల 12న సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ పాఠశాలలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మాత్రమే కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హులైన ఎస్సీ విద్యార్థులు మాత్రమే హాజరు కావాలని కోరారు. వీజీ సెట్, బీఎల్‌వీ సెట్ రాసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

యూనిఫామ్‌లు సిద్ధం

- 21 నుంచి రెండో విడత పంపిణీ
- జిల్లాలో 899 పాఠశాలలు
- మొత్తం 77,280 యూనిఫామ్‌లు



యూనిఫామ్‌ను చూపిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న నిరుపేద విద్యార్థులకు రెండో విడత అందించే యూనిఫామ్‌లు సిద్ధమయ్యాయి. పాఠశాలల ప్రారంభంలో మొదటి విడత పంపిణీ చేసిన విద్యాశాఖ.. రెండో విడత యూనిఫామ్‌ల పంపిణీకి సిద్ధమైంది. మొదటి విడత యూనిఫాంల స్టిచ్చింగ్ ఒక్కో యూనిఫామ్‌కు రూ.50ల చొప్పున రూ.39,4300లు లబ్ధిదారులైన మహిళలకు అందజేశారు. దీంతో మహిళా సంఘాల సభ్యులు కూలీ సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రూ.25లు పెంచి యూనిఫామ్‌కు రూ.75లు అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మహిళా సంఘాల సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. మొదటి విడత యూనిఫామ్ స్టిచ్చింగ్ బిల్లులు పూర్తిగా చెల్లించారు. రెండో విడత యూనిఫామ్‌ల స్టిచ్చింగ్ బిల్లులు రావాల్సి ఉంది.

విద్యాభివృద్ధియే లక్ష్యంగా..

నిరుపేద విద్యార్థుల్లో విద్యాభివృద్ధియే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా యూనిఫాంలు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. నిరుపేదల్లో అక్షరాస్యత పెంచడమే కాకుండా కనీస అవసరాలను కల్పిస్తుంది. ఇటీవల ప్రైవేట్ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య కంటే ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.

డీఆర్డీఏ ఆధ్వర్యంలో 68వేలు

డీఆర్డీఏ ఆధ్వర్యంలో మొదటి విడత 68వేల యూనిఫామ్‌లు స్టిచ్చింగ్ పూర్తి చేసి అందజేశాం. రెండో విడత సైతం 68వేలు స్టిచ్చింగ్ ప్రక్రియ ఇటీవల పూర్తి చేసి ఆయా పాఠశాలలకు అప్పగించామని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు తెలిపారు. త్వరలోనే డీఈఓ ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో 9280

మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో స్టిచ్చింగ్ ప్రక్రియ వేగంగా జరుగుతోందని మెప్మా పీడీ ఇందిర తెలిపారు. మొత్తం 9,280 యూనిఫామ్‌లు స్టిచ్చింగ్‌కు అప్పగించారని, ఇప్పటి వరకు 90శాతం పూర్తి చేశామని తెలిపారు. ఈనెల 18వ తేదిలోగా స్టిచ్చింగ్ పూర్తి చేసి డీఈఓకు అందజేస్తామని మెప్మా పీడీ తెలిపారు.

జిల్లాకు 77,280 యూనిఫామ్‌లు

జిల్లాలో ప్రభుత్వ ప్రైమరీ స్కూల్స్ –623, అప్పర్ ప్రైమరీ స్కూల్స్–129, హైస్కూల్స్ 146, ఒక అర్బన్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలు–15, మోడల్ స్కూల్స్–7, గురుకులాలు 23 పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు మాత్రమే విద్యాశాఖ యూనిఫామ్‌లు అందజేస్తుంది. గురుకుల పాఠశాలల విద్యార్థులకు విద్యాశాఖకు సంబంధం లేకుండా ప్రత్యేకంగా యూనిఫామ్‌లు వస్తాయి.

21 నుంచి పంపిణీ చేస్తాం



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన యూనిఫామ్‌ల స్టిచ్చింగ్ ప్రక్రియ 90శాతం పూర్తయ్యింది. మరో ఐదురోజుల్లో పూర్తి స్థాయిలో స్టిచ్చింగ్ పూర్తవుతుంది. ఈనెల 21 నుంచి విద్యార్థులకు రెండో విడత యూనిఫామ్‌లు అందజేస్తాం.

–రాధాకిషన్, డీఈఓ, మెదక్

ఎట్టకేలకు ఫలించిన కల

మెదక్‌కు వైద్యకళాశాల మంజూరు



ప్రైవేట్ భవనంలో మెడికల్ కళాశాల

మెదక్‌జోన్: మెదక్ జిల్లాకు వైద్యకళాశాల మంజూరైందని కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కళాశాల మంజూరు కోసం వైద్యారోగశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు వైద్యాధికారుల కృషి ఉందన్నారు. ఇక నుంచి ప్రజలకు వైద్యం మరింత చేరువ కానుందన్నారు. ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న జిల్లా ప్రజల కల నెరవేరబోతున్నందుకు సంతోషంగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కాగా, సొంత భవనం లేని కారణంతో పాటు వసతుల కల్పన సరిగ్గా లేవని జిల్లాకు కళాశాల అనుమతిని నిరాకరించిన విషయం తెలిసిందే. జాతీయ వైద్య మండలి కళాశాల (ఎన్‌ఎంసీ) నిబంధనల ప్రకారం ఆ భవనాన్ని 30 ఏళ్ల లీజుకు తీసుకుంటున్నట్లు భవన యజమానితో అధికారులు అగ్రిమెంట్ తీసుకున్నారు. అన్ని రకాల సదుపాయాలను సైతం ఏర్పాటు చేశారు. మెడిసిన్‌లో ఎనిమిది డిపార్ట్‌మెంట్లు ఉండగా.. నాలుగున్నర సంవత్సరాల పాటు కోర్సు ఉంటుంది. ఒక్క సంవత్సరం పాటు హౌజ్‌సర్జరీ ఉంటుంది. మెడిసిన్ పూర్తి చేసేందుకు మొత్తం ఐదున్నరేళ్లు గడువు పడుతుంది. ఇందుకు సంబంధించిన అన్ని రకాల సదుపాయాలు (ఎక్విప్‌మెంట్) ఏర్పాటు చేసి రెండోసారి అప్పీల్ చేసినట్లు వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. చివరకు అధికారుల కృషి ఫలించింది.



ఐలమ్మ చిత్ర పటానికి నివాలులు అర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర శాఖల అధికారులు

ఐలమ్మ.. గొప్ప వీర వనిత

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు రజాకార్లను ఎదిరించిన ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. మంగళవారం మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఐలమ్మ 39వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కొంగు నడుముకు చుట్టి, కొడవలి చేతబట్టి నైజాం సర్కార్‌తో పాటు విస్నూర్ దొరల ఆగడాలను ఎదిరించిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆనాడు భూమి కొరకు, భుక్తి కొరకు, వెట్టి చాకిరీ విముక్తి కొరకు జరిగిన సాయుధ పోరాటంలో దొరలు, రజాకార్ల దురాగతాలను ఎదిరించిన గొప్ప వీర వనిత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ అధికారి నాగరాజు గౌడ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో నాణ్యమైన భోజనం

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య
- సమస్యలు పరిష్కరిస్తానని హామీ



మాట్లాడుతున్న చైర్మన్ బక్కి వెంకటయ్య

రామాయంపేట(మెదక్): హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, కమిషన్ సభ్యులతో కలిసి రామాయంపేటలోని బాలికల గురుకుల పాఠశాల, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లలో నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం ఇవ్వాలని, తమ సమస్యలను విద్యార్థులు ధైర్యంగా చెప్పాలన్నారు. అంతకుముందు గురుకుల పాఠశాలలో తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గురుకుల పాఠశాల, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో చైర్మన్, సభ్యులను సన్మానించారు. కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, గురుకులాల జోనల్ అధికారిణి ప్రత్యూష, డీసీవో సువర్ణలత, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు పాతూరి రాజు, ఇతర ప్రతినిధులు సాగర్, మల్లేశం, శాంతికుమార్, సంజీవ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గర్గుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేగుంటలో...

చేగుంట(తూప్రాన్): చేగుంట ఎస్సీ బాలుర, వడియారం ఎస్సీ బాలికల వసతిగృహాలను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వసతి గృహంలో అందిస్తున్న భోజనం వసతిగృహ నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. చేగుంట హాస్టల్‌లో గదుల కొరత ఉందని, వడియారంలో వంట శాల శిథిలావస్థలో ఉందని తెలిపారు. వసతి గృహాల నిర్వహణపై వార్డెన్‌లకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎస్‌సీ డీఓ శశికళ, తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, ఏఎస్‌డబ్ల్యూఓ లింగేశ్వర్, హెచ్‌డబ్ల్యూఓ స్వాతి, కమిషన్ సభ్యులు లక్ష్మీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నీరు.. పారిశుద్ధ్యంపై అవగాహన

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్‌జోన్: స్వచ్ఛమైన నీటిని తాగటంతో పాటు పారిశుద్ధ్యాన్ని పాటించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సహకారంతో మహిళా అభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన నీరు- పారిశుద్ధ్యంపై డీఆర్‌డీఓ, మెప్మా, మహిళా సంఘాలకు, ఎంపీవో, ఎంపీడీవోలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీరు పారిశుద్ధ్యం పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలను చైతన్యం చేయడంలో డీఆర్‌డీఏ, మెప్మా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని కోరారు. పారిశుద్ధ్యం పచ్చదనం ఆరోగ్యం సమపాళ్లలో అందినప్పుడే ఆరోగ్యం. అందమైన సమాజం ఏర్పడుతుందన్నారు. అంతకు ముందు సురక్షితమైన తాగునీరు, పారిశుద్ధ్యంపై తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, మెప్మా పీడీ ఇందిర, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నవీన్, భూగర్భ జలవనరుల శాఖ అధికారి పాల్గొన్నారు

మిల్లర్లు నిర్లక్ష్యం చేస్తే సహించం

మెదక్ కలెక్టరేట్: రైస్ మిల్లర్లు అలసత్వం వీడి వెంటనే సీఎంఆర్ రైస్ ప్రభుత్వానికి అందించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. రైస్ మిల్లర్లతో సీఎంఆర్‌పై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. బియ్యాన్ని గడువులో రికవరీ చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారిని ఆదేశించారు. సమీక్షలో జిల్లా పౌర సరఫరాల అధికారి సురేశ్ రెడ్డి, జిల్లా మేనేజర్ హరికృష్ణ, జిల్లా రా మిల్లర్స్ అధ్యక్షులు వీరేశం, ఇతర రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.



ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీఓ

పల్లె ప్రగతి పనులను పరిశీలన

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో పల్లె ప్రకృతి వనులను డీఎల్‌పీఓ సురేష్ బాబు పరిశీలించారు. మంగళవారం చల్మెడ గ్రామంలోని గ్రామ పంచాయతీ భవనం, రికార్డులు, డంప్ యార్డు, పల్లె ప్రకృతి వనం, మురికి కాల్వలు, అంగన్‌వాడీ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

19న మిలాద్-ఉన్-నబీ

తూప్రాన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మిలాద్-ఉన్-నబీ పండుగను ఈ నెల 16కు బదులుగా 19న నిర్వహించుకోవాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఎస్పీ సూచనలను ముస్లిం మతపెద్దలు అంగీకరించారు.

శివ్వంపేట ఏఈపై వేటు

నర్సాపూర్: ట్రాన్స్‌కో శివ్వంపేట సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ బి.దుర్గాప్రసాద్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆ సంస్థ రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ భిక్షపతి ఆదేశాలు జారీ చేశారు. ఒక పనికి సంబంధించిన వర్క్ ఆర్డర్ రిలీజ్ చేయడానికి దుర్గాప్రసాద్ లంచం డిమాండ్ చేస్తున్నాడని బాధితులు ప్రత్యేక కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఆరోపణలు రుజువు కావడంతో ఏఈ దుర్గాప్రసాద్‌పై వేటు వేశారు. తమ సంస్థలో అవినీతిని సహించేది లేదని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారుఖీ హెచ్చరించారు.

సాంకేతికను అందిపుచ్చుకోవాలి

- డిజిటల్ యాప్స్‌తో వ్యవసాయ రంగంలో విప్లవం
- శ్రమ, సమయం, డబ్బు ఆదా
- జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయ అధికారి గోవింద్

మెదక్ కలెక్టరేట్: డిజిటల్ యాప్స్‌తో వ్యవసాయ రంగంలో విప్లవం సంతరించుకుంటుందని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయం వ్యవసాయ శాఖ కార్యాలయంలో డిజిటల్ యాప్, డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ వ్యవసాయ కోర్సులు, క్యాబి బయో ప్రొటెక్షన్ పోర్టల్, ప్లాంట్ వైస్ ప్లస్ నాలెడ్జ్ బ్యాంక్, క్రాప్ స్ప్రేయర్ వంటి యాప్‌లకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయంలో ఆధునికత సాంకేతికత అందిపుచ్చుకున్నప్పుడే వ్యవసాయ రంగంలో అధిక లాభాలు సాధించవచ్చని తెలిపారు. తక్కువ సమయంలో తక్కువ శ్రమతో ఎక్కువ దిగుబడి, ఎక్కువ ఆదాయం పొందవచ్చని, దీంతో రైతులు తమ ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చుకోవాలని సూచించారు.

అంతా సెల్‌ఫోన్‌లోనే..

ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్ ఉంటుంది. వీటి ద్వారా డిజిటల్ యాప్స్‌ను డౌన్లోడ్ చేసుకొని వాడుకున్నట్లయితే రోజువారి వ్యవసాయ కార్యక్రమాలలో నూతన ఒరవడి సాధించవచ్చునని ఆయన తెలిపారు. వ్యవసాయ పరిజ్ఞానంతో చీడపీడల నివారణ, సేంద్రియ పద్ధతులపై అవగాహన పెంచుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు రాజ్ నారాయణ, సోమలింగారెడ్డి, హర్ష, దేశీ కోఆర్డినేటర్ అమరేష్ కుమార్, సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ దక్షిణాసియా కోఆర్డినేటర్ మధు మంజరి పాల్గొన్నారు.

యువ రైతులకు ఎంతో ప్రయోజనం

అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ యాప్, డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ వ్యవసాయ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాబీ బయో ప్రొటెక్షన్ పోర్టల్, ప్లాంట్ వైస్ ప్లస్ నాలెడ్జ్ బ్యాంక్, క్రాప్ స్ప్రేయర్ వంటి యాప్‌లు వ్యవసాయ రంగంలోని అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తాయని తెలిపారు.

మంజీరాకు ఫార్మా ముప్పు!

నదికి దగ్గరలోనే ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్

- 'ఫార్మా' వ్యర్థాలతో నది కలుషితమవుతుందనే ఆందోళన
- సింగూరు ప్రాజెక్టుకు ఎగువనే ఈ ప్రాంతం
- సింగూరు నుంచే జంటనగరాలకు తాగునీరు
- ఉమ్మడి మెదక్‌కు సాగునీరు



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం చాల్కీ వద్ద మంజీరా నదిలో కలుస్తున్న పెద్దవాగు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: మంజీరా నదికి 'ఫార్మా' ముప్పు పొంచి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ఫార్మా విలేజ్ ప్రాంతం ఈ నదికి సమీపంలో ఉంది. ఇక్కడికి కేవలం నాలుగైదు కిలోమీటర్ల దూరంలోనే మంజీరా ప్రవహిస్తోంది. ఆయా గ్రామాల శివారుల గుండా ప్రవహించే వాగులన్నీ ఈ మంజీరా నదిలోనే కలుస్తున్నాయి. దీంతో ఫార్మా కంపెనీల నుంచి వచ్చే వ్యర్థ జలాలతో నది జలాలు కలుషితమవడం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతోంది.

గ్రీన్‌ఫీల్డ్ ఫార్మాసిటీలు

ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయం విదితమే. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది జిల్లాల్లో పది ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేస్తోంది. ఇందులో సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం పరిధిలోని డప్పూరు, మాల్గీ, వడ్డీ గ్రామాల పరిధిలో ఫార్మా విలేజ్ (క్లస్టర్)ను ఏర్పాటు చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. మొత్తం 2003 ఎకరాల భూమిని సేకరించి ఫార్మా కంపెనీలకు అప్పగించాలని భావిస్తోంది. ఈ భూసేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదలైంది.

మంజీరా అభయారణ్యానికి సైతం..

మంజీరా అభయారణ్యంపై కూడా ఈ ఫార్మా ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మంజీరా డ్యాం సమీపంలోనే అభయారణ్యం విస్తరించి ఉంది. ఇక్కడి చిత్తడి నేలకు ప్రపంచ స్థాయి రాంసర్ గుర్తింపు కోసం ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఫార్మా విలేజీ ఏర్పాటైతే ఈ ఇక్కడి పక్షులు, మొసళ్లు, ఇతర జీవ జాతుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది

సింగూరులోకి 'ఫార్మా' వ్యర్థ జలాలు

ప్రతిపాదిత ఫార్మా విలేజ్ మూడు గ్రామాల నుంచి చాకలివాగు, కోటవాగు, నక్కల వాగు, న్యాల్‌కల్ వాగు ప్రవహిస్తుంటాయి. ఈ చిన్న వాగులన్నీ చెనెగపల్లి జలాశయంలో కలుస్తుంటాయి. ఈ చెనెగపల్లి ప్రాజెక్టు నుంచి వచ్చే నీరంత పెద్ద వాగులో కలిసి మరియాపూర్, హుమాపూర్ గ్రామాల శివారు గుండా పారి చాల్కీ సమీపంలోని మంజీరా నదిలో కలుస్తుంది. దీనికి దిగువనే సింగూరు ప్రాజెక్టు ఉంది.

- ఈ సింగూరు ప్రాజెక్టు నుంచే హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరు సరఫరా అవుతోంది. అలాగే సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు మిషన్‌భగీరథ తాగునీటి పథకాలు ఉన్నాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు సాగునీటికి కూడా ఈ సింగూరు ప్రాజెక్టే ప్రధానం.
- ఇప్పటికే పటాన్‌చెరు పారిశ్రామిక వాడల నుంచి వచ్చే ఫార్మా వ్యర్థజలాలతో నక్కవాగు పూర్తిగా కాలుష్య కాసారంగా మారిన విషయం విదితమే. రానున్న రోజుల్లో మంజీరాకు కూడ నక్కవాగు మాదిరిగానే తయారవుతుందనే వాదన వినిపిస్తోంది.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థులు ఎంపిక


విద్యార్థులతో ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు మండలంలోని తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ రాజిరెడ్డి తెలిపారు. ఇటీవల మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రణతి, మౌనిక, వైష్ణవి, చందు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. 13, 14, 15 తేదీల్లో ఖమ్మం జిల్లా కల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కృష్ణాపూర్ నుంచి నలుగురు


ఎంపికైన విద్యార్థులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం సుధాకర్, పీఈటీ రాములు యాదవ్ మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు సోనా, వర్ష, శివాత్మిక, హారిక అత్యంత ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు.

ఖేలో ఇండియా పోటీలకు..


మయాంషి రెడ్డి

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని గొర్రెకల్ గ్రామానికి చెందిన తిరుపతి మయాంషిరెడ్డి అనే బాలిక ఖేల్ ఇండియా క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ఆమె తండ్రి శివరాంరెడ్డి తెలిపారు. తమిళనాడులో 7 నుంచి 10 వరకు సీబీఎస్‌సీఈ నేషనల్ పోటీలు జరుగగా అండర్–14 బాలికల క్రికెట్ విభాగంలో మయాంషిరెడ్డి పాల్గొని ప్రతిభ కనబర్చి బ్రాన్జ్ మెడల్ సాధించి వచ్చే నెలలో జరుగనున్న ఖేలో ఇండియా పోటీలకు ఎంపికైంది.

స్థానికేతరులకే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదు


ఆందోళన చేస్తున్న కార్మికులు

హత్నూర(సంగారెడ్డి): స్థానికులకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బోర్పట్ల గ్రామ శివారులో గల ఎపీటోరియా యూనిట్–1 పరిశ్రమ ఎదుట స్థానికులు, కార్మికులు, టెక్నికల్, కాంట్రాక్టు కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఉద్యోగాల కేటాయింపుల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఎంతో మంది ఉన్నత చదువులు చదివిన వాళ్లు ఉన్నప్పటికీ, ఇతర రాష్ట్రాల వారిని తీసుకొచ్చి ఉన్నత స్థాయి ఉద్యోగాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. బోర్పట్ల గ్రామానికి చెందిన నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతోపాటు, పర్మినెంట్ చేయాలని కోరారు. ఆందోళన విషయం తెలుసుకున్న జిన్నారం సీఐ సుధీర్ కుమార్, హత్నూర ఎస్సై సుభాష్ పరిశ్రమ వద్దకు చేరుకొని కార్మికులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ ఆందోళనకు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నాగ ప్రభు గౌడ్ సంఘీభావం తెలిపి మద్దతు తెలిపారు.

పోషణ మాసం.. ఆరోగ్య సోపానం

ప్రారంభమైన పోషణ్ అభియాన్ మాసోత్సవం


అంగన్‌వాడీలు తయారు చేసిన వివిధ రకాల పోషకాహారాలు

మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర సర్కారు ప్రత్యేక చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగా ప్రతీయేటా సెప్టెంబర్ మాసంలో పోషణ్ అభియాన్ మాసోత్సవం నిర్వహిస్తుంది. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. మొత్తం ఐదు శాఖల సమన్వయంతో ఐసీడీఎస్ యుద్ధ ప్రాతిపదికన ఈ కార్యక్రమం చేపడుతోంది. ఇప్పటికే జిలాల్లో ప్రారంభమైన అవగాహన, పౌష్టికాహారం పంపిణీ 30వ తేదీ వరకు కొనసాగనుంది.

- ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ప్రణాళిక
- పౌష్టికాహార లోపం నివారణకు ఐసీడీఎస్ యుద్ధం
- అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేత
- ఐదు శాఖల సమన్వయంతో ముందుకు..

దుబ్బాక: సిద్దిపేట జిల్లాలో దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాలలో మొత్తం ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో 1,150 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా పాలు, గుడ్లు, బాలమృతంతోపాటు వివిధ రకాల పౌష్టికారం అందిస్తున్నారు. మూడేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ ఎత్తు, బరువు ఏ విధంగా ఉంటున్నారో తెలుసుకుంటూ అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేయించడంలో అంగన్‌వాడీల పాత్ర కీలకం.

పిల్లల్లో పౌష్టికాహార లోపం..

ప్రస్తుతం తీసుకుంటున్న ఆహారంతో పిల్లలు, తల్లులు రక్తహీనత, పోషకాహార లోపంతో ఉంటున్నారు. తక్కువ బరువుతో శిశువులు జన్మిస్తున్నారు. ఈ క్రమంలో పిల్లలకు పౌష్టికాహారం, పెరుగుదల, ఆటంకాలు, అనారోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో పిల్లలు, తల్లులు ఆరోగ్యంగా ఉండటం కోసం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారలోపం అరికట్టేందుకు పోషణ్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థిరమైన ప్రగతికి కేంద్ర బిందువు పిల్లలు.. రాష్ట్రం ప్రగతి సాధించాలంటే సుమారుగా 13 శాతంగా ఉన్న 6 ఏళ్ల లోపు పిల్లలు, గర్భిణులకు మంచి ఆహారం, వాతావరణం సమకూర్చాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది.


పోషకాహారంపై తల్లులు, పిల్లలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఇంటింటికీ అంగన్‌వాడీలు

గర్భిణులు, బాలింతలు, పిల్లలు శారీరకంగా, మానసికంగా ఉండేందుకు అంగన్‌వాడీలు కృషి చేస్తున్నారు. పిల్లలకు, తల్లులకు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్నారు. ఎటువంటి ఆహారం తీసుకోవాలి. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు బరువు తగ్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్నారు. 1వ తేదీ నుంచి ప్రారంభమై మాసోత్సవం 30 వరకు కొనసాగుతుంది. జిల్లాలోని ఐదు ప్రాజెక్టుల పరిధిలో స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి శారద ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

పౌష్టికాహారం ఇస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు పిల్లలకు అన్ని పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నాం. కోడిగడ్లు, పాలు, చాలా రకాల పోషక విలువతో కూడిన ఆహారం, పిల్లలకు బాలమృతం అందిస్తున్నాం. నిర్దేశించిన విధంగా పోషకాహారం ఇస్తూ అంగన్‌వాడీల్లోనే తినేలా చూస్తున్నాం. క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు, పిల్లల బరువు, ఇతర ఆరోగ్యంను పరీక్షించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సుజాత, అంగన్‌వాడీ టీచర్, దుబ్బాక

తల్లులు జాగ్రత్తలు పాటించాలి



సరైన అవగాహన లేకపోవడం.. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో గర్భిణులు సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం లేదు. పుట్టబోయే పిల్లలు అవయవ లోపం, తక్కువ బరువుతో పాటు చాలా రకాల ఆరోగ్య సమస్యలతో పుడుతున్నారు. ముఖ్యంగా తక్కువ బరువుతో పుట్టడం వల్ల ఆ పిల్లలు జీవితకాలమంతా బాధ పడాల్సి వస్తుంది. అంగన్‌వాడీల్లో ఇస్తున్న పోషకాహారం తల్లిబిడ్డకు చాలా శ్రేష్ఠం. పౌష్టికాహార లోపం నివారించేందుకు గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– శారద, మహిళా శిశు,సంక్షేమ శాఖ జిల్లా అధికారి

అన్యాయాన్ని నిలదీసిన సివంగి ఐలమ్మ

– సీపీఎం రాష్ట్ర నాయకుడు ఆశయ్య


ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మెదక్ కలెక్టరేట్: అన్యాయాన్ని నిలదీసిన సివంగి చాకలి ఐలమ్మ, ఆమె ఆశయాలను పార్టీ భుజాలపై మోస్తామని సీపీఎం రాష్ట్ర నాయకుడు పైళ్ల ఆశయ్య అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని మంగళవారం మెదక్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రమైన మెదక్‌లోని వెల్‌కమ్ బోర్డు వద్ద గల ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే ప్రత్యేకంగా సభ ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆశయ్య మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ ఆనాడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ముఖ్య నాయకత్వం వహించారని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ.. వీరనారి అయిలమ్మ.. తెలంగాణలో భూస్వాములు, పటేల్, పట్వారీలకు దీటుగా నిలబడిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సమ్మ, మల్లేశం, బస్వరాజు, సంతోష్, ప్రజా సంఘాల నాయకులు అజయ్, లచ్చయ, నాగమణి, దాసు, ప్రవీణ్, బాల్ నర్సయ్య, సక్కుబాయి, రామవ్వ, రెడ్డి, నారాయణ తదిరులు పాల్గొన్నారు.

ఎర్ర జెండాల నాయకత్వంలోనే పోరాటాలు

– సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్


మాట్లాడుతున్న భూపాల్

గజ్వేల్‌రూరల్: ఎర్ర జెండాల నాయకత్వంలో తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాలను మంగళవారం గజ్వేల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎర్ర జెండాల నాయకత్వంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 1946 నుంచి 1951 వరకు జరిగిందని, ఈ క్రమంలో 3 వేల గ్రామాలు ప్రజారాజ్యాలుగా ఏర్పడగా, 10 లక్షల ఎకరాల భూమిని ప్రజలకు పంపిణీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. నాటి పోరాటాల ఫలితంగా లభించిన భూములను కంపెనీలకు, భూస్వాములకు కట్టబెడుతున్నారని, పరిశ్రమల్లో కార్మికులకు కనీస వేతనాలు లేవని, ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అంతకుముందు ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లారెడ్డి, గోపాలస్వామి, శశిధర, రవి, బండ్ల స్వామి, రంగారెడ్డి, ప్రశాంత్, అరుణ్, వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ స్టేడియంలో అథ్లెటిక్స్ పోటీలు


ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో నిర్వాహకులు

మెదక్‌జోన్: పదవ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ అండర్ 14, 16, 18, 20 బాల బాలికలకు పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 30 మంది ప్రతిభ కనబర్చినట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. వీరంతా 19, 20వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సువర్ణలత, మాస్టర్ అథ్లెటిక్స్ అసోషియేషన్ కార్యదర్శి రాజేందర్ శ్వేత, పీడీలు సుజాత, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని తండ్రీకొడుకుల మృతి

- ఆస్పత్రికి వెళ్తుండగా బైక్‌ను ఢీకొట్టిన ట్యాంకర్
- మాసాయిపేట మండలంలో ఘటన


బూదయ్య (ఫైల్)


మల్లేశం(ఫైల్)

చేగుంట(తూప్రాన్): ఆస్పత్రికి బైక్‌పై వెళ్తున్న తండ్రీకొడుకులను ట్యాంకర్ రూపంలో మృత్యువు కబలించింది. ఈ ఘటన మాసాయిపేట మండలం రామంతాపూర్ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన దొంతి బూదయ్య (65) గుండె సంబంధ సమస్యతో ఇబ్బంది పడుతూ ఇటీవలె హైదరాబాద్ మల్లారెడ్డి ఆస్పత్రిలో స్టంట్ వేయించుకున్నాడు. మంగళవారం వైద్య పరీక్షల నిమిత్తం కుమారుడు దొంతి మల్లేశం(37) బైక్‌పై ఆస్పత్రికి వెళ్తున్నారు. రామంతపూర్ శివారులోకి రాగానే వెనుక నుంచి వస్తున్న ట్యాంకర్ బైక్‌ను వేగంగా ఢీకొట్టడంతో తండ్రీకొడుకులు లారీ చక్రాల కిందపడియారు. ఈ ప్రమాదంలో మల్లేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, బూదయ్య నడుము పైనే లారీ టైర్ ఆగింది. అతికష్టం మీద స్థానికులు బయటకు తీసి తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డికి స్థానికులు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మల్లేశం భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ప్రాణం తీసిన భూ తగాదా..

– గడ్డి మందు తాగి రైతు ఆత్మహత్య

దుబ్బాకరూరల్: భూ తగాదా ఓ రైతు ప్రాణం తీసింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగుండవెళ్లి గ్రామానికి చెందిన గంట బాలయ్య(39) అతడి నానమ్మ మల్లవ్వ పేరు మీద ఉన్న ఆరెకరాల్లో మూడు ఎకరాలు సాగు చేసుకుంటున్నాడు. ఈ సాగు చేసే భూమిని తన పేరిట చేయాలని తండ్రి వెంకయ్యతో 3వ తేదీన గొడవ పడ్డాడు. అలాగే, నానమ్మకు రూ.లక్షకు పైగా రుణ మాఫీ జరుగగా ఆ డబ్బులు కావాలని తగాదా పెట్టుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలయ్య అదే రోజు ఇంట్లో గడ్డి మందు గుళికలు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

140 కిలోల ఎండుగంజాయి పట్టివేత

– ఇద్దరు నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రూపేశ్

జహీరాబాద్: అక్రమంగా తరలిస్తున్న 140 కిలోల ఎండుగంజాయిని పట్టుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ రూపేశ్ తెలిపారు. మంగళవారం చిరాగ్‌పల్లి పోలీసు స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. సోమవారం సాయంత్రం చిరాగ్‌పల్లి ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి తన సిబ్బందితోపాటు సీసీఎస్ పోలీసులతో కలిసి పోలీసు స్టేషన్ పరిధిలో గల ఆనంద్ దాబా ఎదుట 65వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ నుంచి అనుమానాస్పదంగా వస్తున్న బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా 140 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. వాహనంలో బీదర్ జిల్లా బాల్కి తాలూకాలోని షాపూర్ గ్రామానికి చెందిన లఖన్, అదే జిల్లా బసవేశ్వర చౌక్ ప్రాంతానికి చెందిన సిద్ధిరామ్ ఉండగా ఇద్దరినీ అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి మరికొందరు నిందితులైన మల్గొండ, రాహుల్, కిరణ్, సునీల్, మల్లేశ్ నాయక్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి రూ.35 లక్షల ఉటుందన్నారు. సమావేశంలో డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, సీఐ శివలింగం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్, ఎస్‌ఐ శ్రీకాంత్, చిరాగ్‌పల్లి ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డిలతో పాటు మాణిక్‌రెడ్డి, ఏఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలి


ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్పీఓ, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): ఓపెన్ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం దాఖలైన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని డీఎల్పీఓ అమృత ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని కుప్పనగర్ గ్రామంలో కొనసాగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, ఎంపీఓ రాములు, పంచాయతీ కార్యదర్శి స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు నిరంతరం అండగా ఉంటాం

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



మాట్లాడుతున్న మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు నిరంతరం అండగా ఉంటామని తోషిబా యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. తోషిబా పరిశ్రమలో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా మంగళవారం జరిగిన గేట్ మీటింగ్‌లో మల్లికార్జున్ మాట్లాడారు. కార్మికులకు కష్ట సుఖాల్లో అండగా ఉంటూ చట్టాల గురించి తెలిసిన నాయకులు సీఐటీయూ నాయకులని, కార్మికుల పక్షాన చట్టాలను పూర్తిగా అమలయ్యే విధంగా చూస్తున్నట్లు తెలిపారు. మిగితా యూనియన్లకు కార్మిక చట్టాల గురించి ఏమాత్రం అవగాహన లేదన్నారు. ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్ నాయకులు యజమానులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నేడు తోషిబా పరిశ్రమలో జరిగే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో చుక్క గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు రాజయ్య, యూనియన్ సెక్రెటరీ అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి..

- అనారోగ్యంతో సుల్తాన్‌పూర్ వాసి మృతి
- మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని విజ్ఞప్తి

హవేళీఘణాపూర్(మెదక్): బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి అనారోగ్యంతో మృతి సుల్తాన్‌పూర్ వాసి మృతి చెందగా, కడచూపు చూసే భాగ్యమైనా కల్పించాలని మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని కుటుంబీకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వివరాల్లో వెళ్తే.. మెదక్ జిల్లా హవేళీఘణాపూర్ మండలం సుల్తాన్‌పూర్ తండాకు చెందిన రమావత్ వసురాం(40) నెల రోజుల కిందట దుబాయ్‌కు ఉపాధి కోసం వెళ్లాడు. వారం రోజుల కిందట కంపెనీ నుంచి బయటకొచ్చి వసురాం మృతి చెందినట్లు నిజామాబాద్ ఏజెంటు ద్వారా కుటుంబీకులకు సమాచారం అందింది. అప్పటి నుంచి వారు ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కుటుంబ పెద్దదిక్కైన వసురాం కడసారి చూపు అయిన చూసే భాగ్యం కల్పించాలని కుటుంబీకులు వేడుకుంటున్నారు. మృతుడికి భార్య విజ్జి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మద్యం మత్తులో గొడవ

- స్నేహితుడిని చితకబాదిన మరో ముగ్గురు
- తీవ్ర గాయాలతో మృతి


హనుమాన్‌దాస్ (ఫైల్)

పుల్‌కల్(అందోల్): స్నేహితుల మద్యం పార్టీ ఓ యువకుడి ప్రాణం తీసింది. పుల్‌కల్ ఎస్‌ఐ క్రాంతికుమార్ కథనం మేరకు.. ముదిమాణిక్యం గ్రామానికి చెందిన అనిల్, దుర్గా ప్రసాద్, ఫత్తులు సోమవారం సాయంత్రం తండాకు ఆటోలో హనుమాన్ దాస్(23) ఇంటికొచ్చి రూ.10 వేల అప్పు అడిగారు. అతడు ఇవ్వగానే మద్యం సేవిద్దామని రమ్మని అందరూ ఆటోలో బయలు దేరారు. నలుగురూ కలిసి పుల్‌కల్‌లో మద్యం సేవించారు. ఆ సమయంలోనే నలుగురి మధ్య గొడవ జరిగింది. ఇందులో ముగ్గురు హనుమాన్ దాస్‌ను తీవ్రంగా కొట్టారు. అనంతరం వారే పుల్‌కల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాయపడిన హనుమాన్ దాస్ అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి మాన్య నాయక్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవద్దు

- సిద్దిపేట ప్రభుత్వానుపత్రి సైకియాట్రి విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ శాంతి
- వైద్య విద్యార్థుల ఫ్లాష్ మాబ్


ప్లకార్డుతో అవగాహన కల్పిస్తున్న వైద్య విద్యార్థులు డాక్టర్ శాంతి, ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్: క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడి ప్రాణాలు తీసుకొని తమ విలువైన జీవితాన్ని కోల్పోవద్దని సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సైకియాట్రీ విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ శాంతి అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం సిద్దిపేట బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తాలో, ప్రభుత్వాస్పత్రిలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఆటలు, నృత్యాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. వివిధ ప్రదర్శనల ద్వారా ప్రభుత్వాస్పత్రి మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మౌనం వీడండి, ఆత్మహత్యల కారణాలను పరిశీలించండి వాటికి నివారణోపాయాలు ఇచ్చే సైన్స్‌ను నమ్మండి అని తెలిపారు. అనంతరం ఏసీపీ మధు, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్‌బాబు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి ఫిజికల్ ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసికంగా ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంధ్య, డాక్టర్ స్వర్ణ, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో..


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సంగారెడ్డి: ఎవరైనా సరే ఆవేశానికి పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ సూచించారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ కళాశాల విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ప్రజలకు రోగులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుధా మాధురి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

‘సురభి’ వైద్య కళాశాలలో..

సిద్దిపేటఅర్బన్: తమకు ఎదురైన సమస్యల వల్ల ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడకుండా సానుకూలంగా ఆలోచించి సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని సురభి వైద్య కళాశాల సైకియాట్రిక్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దేవిక అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం అర్బన్ మండలం మిట్టపల్లిలోని సురభి వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రిలో ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల డీన్ రఫీ, మెడికల్ సూపరింటెండెంట్ శివరామాచారి, మెడిసిన్ హెచ్‌ఓడీ కరుణాకర్, ఆర్‌ఎంఓ జలపతినాయక్, పీఆర్‌ఓ పరశురాములు, మెడికల్ విద్యార్థులు ఉన్నారు.